క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

మాకవరపాలెం: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కోరారు. గిడుతూరులో ఆదివారం ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి సర్వేను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలే పిల్లల కోసం ఇంటింటికీ తిరిగేవారన్నారు. కానీ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి పిల్లలను తమ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేయడం అభినందనీయమన్నారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్.శ్రీరామ్మూర్తి, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవం

మాడుగుల రూరల్: మాడుగుల –దబ్బకుంట రహదారిలో పురాతన ఉమా భీమలింగేశ్వర ఆలయంలో నూతనంగా సోమవారం ఉదయం 10 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. ఆశం సురేశ్ గుప్తా సోనీ, ఆశం సంతోష్‌గుప్తా ఆలేఖ్య దంపతుల ఆర్థిక సహకారంతో ఈ ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం ఇక్కడ ఏఎంసీ ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కాంతి కుమార్

నర్సీపట్నం: పట్టణంలోని రౌడీషీటర్లకు టౌన్ సీఐ కాంతికుమార్ ఆదివారం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేస్తే పీడీ యాక్టు తెరుస్తామని హెచ్చరించారు. ఎన్నికలే కాకుండా పట్టణంలో ప్రస్తుతం మరిడిమాంబ పండగలో ఎక్కడైనా ఎవరితోనైనా గొడవలకు దిగితే శిక్షార్హులు అవుతారన్నారు. ఎస్సైలు సుధాకర్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు సరకులు పంపిణీ చేస్తున్న నాసా సంస్థ ప్రతినిధి శ్రీను

నాతవరం: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గిరిజన బాధితులకు నాసా స్వచ్ఛంద సేవా సంస్థ నాసా సంస్థ డైరెక్టరు జ్యోతి ప్రేమదాస్ చేయూతనందించారు. సరుగుడు పంచాయతీ శివారు సుందరకోటలో ఇటీవల విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో పూరిళ్లు కాలిపోయాయి. ప్రమాద బాధితులు బ్రహ్మయ్య, కూడా వెంకయ్యమ్మ, కూడా రాజులమ్మ, జంపా పెంటయమ్మ కుటుంబీకులకు ఎనిమిది రకాల నిత్యావసర సరకులతో వంట పాత్రలు ఇతర సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. మైదాన ప్రాంతాల్లో చేతిబోర్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తీర్చామని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి తాటిపాక శ్రీను తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో బోర్లు వేశామన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందడి



జలకాలాట ఆడుతున్న సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. మండు వేసవిలోనూ ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్య లోంచి జాలువారే నీటిలో జలకాలాట ఆడేందుకు పోటీ పడ్డారు. ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు సైతం ఇక్కడ జలపాతం చూసేందుకు తరలివచ్చారు. ఉదయం నుంచి స్నానాలు చేసి ఆటపాటలతో సాయంత్రం వరకు సందడి చేశారు. మండలంలో చాలా ప్రాంతాల్లో భూగర్భ జలా లు అడుగంటిపోగా, ఇక్కడ మాత్రం నీటి ప్రవాహం తగ్గకపోవడం విశేషం.

రేషన్ బండి వచ్చింది!

- గిరిజనుల ఇంటి వద్దకే బియ్యం
- గత పాలనలో 7 కిలోమీటర్లు నడవాల్సిందే..
- నేడు తొలగిన వ్యయప్రయాసలు



రేషన్ సరుకుల వ్యాన్



గిరిజన గ్రామం బుడ్డడపాడులో బియ్యం సరఫరా(ఫైల్)

గొలుగొండ: రాళ్లూరప్పలు దాటుకుని కొండలు గుట్టలు ఎక్కి దిగితేగానీ గిరిజనులకు రేషన్ అందేది కాదు. దశాబ్దాలుగా పడుతున్న ఈ కష్టాలకు వైఎస్సార్‌సీపీ పాలనలో చెక్ పడింది. నేడు రవాణా వ్యవస్థ మెరుగుపర్చడంతోపాటు నేరుగా ఇంటి వద్దకే రేషన్ బండి వచ్చి బియ్యం ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ పాలనలో

2014–19 టీడీపీ పాలనలో గిరిజనుల కష్టాలు వర్ణనాతీతంగా ఉండేవి. నర్సీపట్నం డివిజన్ పరిధిలోని 2,530 గిరిజనులు రేషన్ కార్డులు కలిగి ఉన్నారు. వీరంతా రేషన్ కోసం గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో పడరాని పాట్లు పడేవారు. రేషన్ డిపోలు పంచాయతీ కేంద్రాల్లో ఉండటం వల్ల శివారు గిరిజన గ్రామాల నుంచి కాలినడకన వెళ్లడం ఎంతో కష్టంగా ఉండేది. అప్పట్లో సర్వర్లు సరిగ్గా పనిచేయకపోవడం వల్ల ఒక్కొక్కసారి రెండు, మూడుసార్లు రేషన్ డిపోకు రావల్సి వచ్చేది. దీనివల్ల రోజూ కూలి నష్టపోయేవారు. ఈ విధంగా నెలకు ఒక్కొక్క కుటుంబం రూ.500 వరకు నష్టపోయేది. కొన్నిసార్లు రేషన్ డిపోకు వెళ్లలేకపోవడంతో తిండిగింజలు లేక ఇబ్బందులు పడేవారు.

గిరిజన గ్రామాలు ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్నాయంటే...

➡ గొలుగొండ మండలం బుడ్డడపాడు, పోలవరం, చంద్రయ్యపాలెం, రుత్తలపాలెం, నిమ్మగెడ్డ, కరక, జిల్లెడిపూడి తదితర గిరిజన గ్రామాలు పంచాయతీ కేంద్రానికి నాలుగు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

➡ నర్సీపట్నం మండలం ఉప్పరగూడం, లింగాలపాలెం తదితర గిరిజన గ్రామాలు పంచాయతీ కేంద్రాలకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

➡ నాతవరం మండలం మాసంపల్లి, దద్దగుల, రామన్నపాలెం, తిరుపురం, తొరడ, అసనగిరి తదితర గిరిజన గ్రామాలు ఆయా పంచాయతీ కేంద్రాలకు ఐదు నుంచి ఏడు కిలోమీటర్లు దూరంలో ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీ పాలనలో..

నేడు ఇంటింటికీ ప్రజా పంపిణీ వ్యవస్థను తీసుకొచ్చారు. రేషన్ డిపోలకు దూరంగా ఉన్న గిరిజనులకు ఇదెంతో మేలు కలిగింది. నర్సీపట్నం డివిజన్ పరిధిలోని 13 వేల మంది ఇంటి వద్దకు నేరుగా బియ్యం సరఫరా అవుతోంది. ఇలా చేయడం వల్ల వ్యయప్రయాసలు తొలగాయని గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



మాది పాతమల్లంపేట పంచాయతీ శివారు బుడ్డడపాడు గిరిజన గ్రామం. గతంలో ద్వారకానగరంలో రేషన్ డిపో ఉండేది. మా గ్రామం నుంచి రానుపోను 14 కిలోమీటర్ల దూరం నడిచి బియ్యం కోసం వెళ్లేవాళ్లం. ఒక్కొక్కసారి రెండు సార్లు వెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల వ్యయప్రయాసలకు గురయ్యేవారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా గ్రామానికి రోడ్డు వేయడంతోపాటు నేరుగా ఇంటికి బియ్యం అందుతున్నాయి. ప్రతి నెలా 8న రేషన్ వ్యాన్ వస్తోంది. మా కష్టాలు తొలగించిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– బురికి రాజులమ్మ, బుడ్డడపాడు గిరిజన మహిళ

ఇంటికే నేరుగా బియ్యం



మా గిరిజనులంతా గతంలో బియ్యం కోసం ఎన్నో ఇబ్బందులు పడేవారు. జగన్‌బాబు సీఎం అయ్యాక ఎటువంటి ఇబ్బందులు లేవు. ఇప్పుడు ప్రతి నెలా ఆరో తేదీన ఇంటికి వచ్చి బియ్యం అందిస్తున్నారు. ఇటువంటి పాలన అందిస్తున్న సీఎంకు మేమంతా రుణపడి ఉంటాం.

ఉల్లి సింహాచలం,
పోలవరం గిరిజన గ్రామం

ప్రగతి ‘బాట’

- 40 గ్రామాలకు తొలగనున్న రవాణా కష్టాలు
- రూ.9 కోట్లతో 9 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు



కింతలి రోడ్డు పనులు



ఘాట్‌రోడ్ జంక్షన్ నుంచి జంపెన వరకు పూర్తయిన రోడ్డు

మాడుగుల: గత టీడీపీ పాలనలో అధ్వానంగా మారిన రోడ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మోక్షం కలిగిస్తోంది. ఇందులో భాగంగా కింతలి నుంచి ఘాట్‌రోడ్ జంక్షన్ వరకు 9 కిలోమీటర్ల మేర రూ.9 కోట్లు ఆర్అండ్‌బీ నిధులతో అంచెలంచెలుగా రోడ్డు పనులు చేశారు. ఆదివారం కింతలి నుంచి తారురోడ్డు పనులు ప్రారంభం కావడంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కిలోమీటరుకు కోటి రూపాయలు వెచ్చించి నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మిస్తున్నారు.

40 గ్రామాలకు ఆధారమైన రోడ్డు

ఈ రోడ్డు పనులు పూర్తయితే మండలంలో జంపెన, గాదిరాయి, సత్యవరం, ఎం.కృష్ణాపురం, వీజేపురం, జేడీపేట, ఎల్.పొన్నవోలు, జాలంపల్లి, కింతలి, కింతలి వల్లాపురం, అవురువాడ, పంచాయతీల్లో 40 గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తొలగనున్నాయి.

రోల్ మోడల్‌గా మాడుగుల



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహ కారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చరిత్రలో నిలిచిపోతారు. ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేసి వెళ్లిపోవడమే తప్ప, ఒక్క గొయ్యి పూడ్చిన పాపానపోలేదు. 50 ఏళ్లలో చేయని అభివృద్ధి ఐదేళ్లలో పూర్తి చేసి మాడుగులను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దారు.

– నేమాల గురువునాయుడు, సర్పంచ్ జంపెన

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారు



ఐదేళ్లలో మారుమూల గ్రామాలకు సైతం పక్కారోడ్లు, తదితర అభివృద్ధి పనులు చేశారు. దీన్ని చూసి ప్రతిపక్షాల నేతలు ఓర్వలేకపోతున్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాటల్లో కాదు చేతల్లో చూపించారు. ఆయనకు మాడుగుల ప్రజలు రుణపడి ఉంటాం.

– గోకేడ అప్పలనాయుడు,
సత్యవరం

బూడి నామినేషన్ దాఖలుకు తరలిరండి

మాడుగుల రూరల్: అనకాపల్లిలో సోమవారం పార్లమెంటు స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నామినేషన్ దాఖలు చేయనున్నారని, పార్టీ శ్రేణులు తరలి రావాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అన్ని విభాగాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉదయం 9 గంటలకు ముకుందపురం పెట్రోల్ బంకు వద్దకు రావాలన్నారు. అక్కడ నుంచి వాహనాలతో ఊరేగింపుగా అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటామన్నారు.

మోదకొండమ్మ పంచలోహ విగ్రహం ఏర్పాటు



పంచలోహ విగ్రహ ఊరేగింపులో శ్రీనివాసరావు దంపతులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో మోదకొండమ్మ పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని గ్రామానికి చెందిన అనపగడ్డ శ్రీనివాసరావు, సాయిలక్ష్మి దంపతులు రూ.40 వేలతో తయారు చేయించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అమ్మవారి ఘటాలతో పంచలోహ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రతిష్టించారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పడాల అప్పలనాయుడు, బత్తుల నాగేశ్వరరావు, శ్రీనాథు చిన్నారావు, అప్పాన భాస్కరరావు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పనస అ‘ధర’హో

- జోరుగా పనసకాయల వ్యాపారం
- ఒడిశాకు వేలాది టన్నుల సరఫరా



వ్యాన్‌లో ఒడిశాకు తరలిస్తున్న పనసకాయలు



ముంచంగిపుట్టు సంతలో వ్యాపారులు కొనుగోలు చేసిన పనసకాయలు

ముంచంగిపుట్టు: ఒడిశాలో పనసకాయలకు గిరాకీ నెలకొన్న నేపథ్యంలో వ్యాపారులు గ్రామాల్లోకి వెళ్లి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రతి రోజు ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని గిరిజన గ్రామాల నుంచి వ్యాన్లు, లారీల్లో పనసకాయలను తరలిస్తున్నారు. వారపు సంతల్లో ఈసారి కిలో పనసకాయల ధర ఎన్నడూ లేని విధంగా మొదట్లో రూ.15 నుంచి 25 వరకు ధర పలికింది. తాజాగా కిలో.50 వరకు విక్రయిస్తున్నారు. వర్షాలు మొదలైతే పనసకాయలు పాడైపోతాయి. ఉద్దేశంతో ముందుగానే కాయలను చెట్టు నుంచి కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఖర్జూరం రకం కాయలను పండ్లుగా విక్రయించేందుకు చెట్లకే ఉంచేశారు. ముదురితే పనికి రాని గుజ్జు రకం పనసకాయలను మార్కెట్‌కు సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట మండలాల నుంచి ఒడిశాలోని జయపురం మార్కెట్‌కు రోజు 100 టన్నుల వరకు పనసకాయలను వ్యాపారులు తరలిస్తున్నారు. జయపురం మార్కెట్ నుంచి కటక్, కోల్‌కతా తదితర పట్టణాలకు ఎగుమతి చేస్తున్నారు. ఒడిశాలో బరంపురం, జయపురం, గుజరాత్ ,కోల్‌కతా ప్రాంతాల్లో జరిగే పెళ్లిళ్లలో పనసకాయల వినియోగం ఎక్కువ. ముఖ్యంగా పచ్చళ్లకు, పకోడీలు, ముక్కలతో బిర్యానీ, పొట్టు కూర, గూనచారు, కుర్మా, ఇడ్లీ, బూరెలు, చిప్స్ వంటి ఆహార పదార్థాల్లో అధికంగా వాడుతారు.

ఠారెత్తిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా కె.కోటపాడు రోడ్డు

కె.కోటపాడు: నిప్పు రవ్వలు రాజేస్తున్న ఎండలతో ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేసవి ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గడం లేదు. వారం రోజులుగా ఎండల తీవ్రత మరింత ఎక్కువ కావడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఎండలో రోడ్లపైకి వచ్చి వడదెబ్బ బారిన పడకుండా ఇళ్లకే పరిమితమవుతున్నారు. మండలంలోని పలు ప్రధాన రహదారుల్లో ఆదివారం మధ్యాహ్నం వాహన రాకపోకలు లేక బోసిపోయాయి.

గిరిజన గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



లోసింగిలో గిరిజనులకు పథకాల గురించి వివరిస్తున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట: మండలంలోని గిరిజన గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు గెలుపు కోసం ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు దోసపత్ని రాజు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం వారు పాత లోసింగి, కొత్త లోసింగి, గుర్రాలబయిల తదితర గిరిజన గ్రామాల్లో గిరిజనులను కలిశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంత గిరిజనులకు మేలు చేసే మరిన్ని సంక్షేమాలు, విద్య, వైద్య సదుపాయాలు కల్పించనుందన్నారు. ఇప్పటికే ఈ గ్రామాల్లో రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గిరిజన పక్షపాతి అన్నారు. వీటిని గమనంలో ఉంచుకుని వచ్చే నెల సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

టీడీపీకి ఓటు వేస్తే మన జీవితమే అంధకారం



దిబ్బిడిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: తెలుగుదేశం పార్టీ మోసపూరిత మాటలు విని ఓటేస్తే, ఐదేళ్ల మన జీవితాలు అంధకారంగా మారుతాయని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులకు మద్దతుగా ఆదివారం దిబ్బిడిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. చంద్రబాబు పాలనలో నీరు – చెట్టు పేరిట మట్టి పనులు చేసి జేబులు నింపుకుని, జన్మభూమి కమిటీలతో దోచుకోవడం తప్ప ఒక్క పథకమైన పేదల బతుకుల కోసం అమలు చేశారా? అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పరిపాలన విధానాన్ని మార్చి మండల కేంద్రంలో ప్రభుత్వ సేవలను గ్రామ స్థాయికి తీసుకొచ్చారన్నారు. టీడీపీ హయాంలో పింఛన్, ఇల్లు, రేషన్‌కార్డు, విత్తనాలు, ఎరువులు పొందాలన్న మండల కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా పదే పదే పనులు మానుకొని తిరిగేవారమన్నారు. జగనన్న వచ్చిన తర్వాత గ్రామాల్లోనే సచివాలయాలు, ఆర్బీకేలు ఏర్పాటు చేసి సచివాలయ సిబ్బంది, వలంటీర్లను నియమించి పైసా లంచం లేకుండా సంక్షేమ పథకాలు, ఎరువులు, విత్తనాలు అందేలా చేశారన్నారు. ప్రజలు సంతోషంగా జీవించడం టీడీపీ నాయకులకు నచ్చదని, వారికి తగిన బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, మాజీ సర్పంచ్ గొంపా అప్పారావు, నాయకులు జెర్రిపోతుల రామారావు, భూషణం పాల్గొన్నారు.

గొలుగొండలో మోస్తరు వర్షం



ఏఎల్‌పురంలో వర్షం కురుస్తున్న దృశ్యం



బుచ్చెయ్యపేట రోడ్డులో కురుస్తున్న చిరు జల్లులు

గొలుగొండ: మండల ప్రజలకు వర్షంతో ఊరట లభించింది. కొంకసింగి, నాగాపురం, ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట, గొలుగొండ, జోగుంపేట తదితర ప్రాంతాల్లో అరగంట పాటు మోస్తరు వర్షం కురిసింది. తీవ్ర ఎండల ప్రభావంతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. గాలుల తోపాటు వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బుచ్చెయ్యపేటలో చిరుజల్లులు...

బుచ్చెయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో చిరు జల్లులు కురిశాయి. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ తీవ్రంగా కాసింది. రెండు గంటల తర్వాత ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని వాతావరణం చల్లబడింది. మూడు గంటలు ప్రాంతంలో చిరుజల్లులు కురిశాయి. దీంతో చల్లని వాతావరణంలో ప్రజలు సేదతీరారు.

మరిడిమహాలక్ష్మి ఉత్సవ ఏర్పాట్లు



మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అబిద్ సెంటర్‌లో అమ్మవారి నిలువెత్తు హోర్డింగ్

నర్సీపట్నం: పట్టణ ప్రజల ఇలవేల్పు మరిడిమహాలక్ష్మి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి మూడేళ్లకొకసారి అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 23న అమ్మవారి పండగ జరగనుంది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పెద్ద ఎత్తున విద్యుత్ అలంకరణ చేశారు. అబిద్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి నిలువెత్తు హోర్డింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివారం ఇక్కడ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

బీజేపీకి ఓటుతో బుద్ధిచెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.లోకనాథం

అనకాపల్లి: కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం జరిగిన అఖిలభారత తపాల, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం తొమ్మిదవ వార్షిక మహాజన సభలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



అమ్మవారి ఆలయంలో భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర రెండో ఆదివారం సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి, బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూకాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయం వద్ద రహదారిపై భక్తులు బారులుతీరారు. పలు స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు భక్తులకు ఉచితంగా మజ్జిగ, తాగునీరు, అమ్మవారి ప్రసాద వితరణ చేపట్టారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు జి.శంకరరావు, పైడపునాయుడు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాలయం ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.